క్లుప్తంగా

ఆరోపణలు తగవు

ఆత్మకూరు : తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై కావాలని కొందరు ఆరోపణలు చేస్తున్నారని వీరిపై పరువునష్టం దావా వేస్తానని అన్నారు. రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక తనపై కుట్రలు పన్నుతున్నారని కుట్రలు తిప్పికొడతామన్నారు. తాను ఏమిచేశానో రైతులకు తెలుసన్నారు.

ఏఎల్‌ఎంకు ఘన సన్మానం

దామెర: మండలంలోని కోగిల్వాయి ఏఎల్‌ఎం వస్కుల కృష్ణను ఆదివారం ఘనంగా సన్మానించారు. కృష్ణ కోగిల్వాయి జేఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు కాగా ఆయనకు ఏఎల్‌ఎంగా పదోన్నతి పొందాడు. కాగా గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్యాక్స్ డైరెక్టర్ గుండ చంద్రమోహన్, ఉపసర్పంచ్ సాంబయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



శాయంపేట : సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన రూ. 2.50 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, నాయకులు ఎస్‌కే గౌస్, విజయ్, ప్రభాకర్, సారయ్య, రాకేశ్ ఉన్నారు.

కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ



ఆత్మకూరు: కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నాంపెల్లి రవీందర్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందగా బీఆర్‌ఎస్ పార్టీ రూ.2 లక్షల చెక్కు మంజూరు చేయగా ఆ చెక్కును ధర్మారెడ్డి ఆదివారం ఆయన నివాసంలో కుటుంబసభ్యులకు అందచేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేయడం కొత్తేమి కాదు'

ఆత్మకూరు: రైతులను మోసం చేయడం కాంగ్రెస్‌కు కొత్తేమి కాదని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్థాయిలో రుణాలు మాఫీకాని రైతుల వివరాలు సేకరించి కలెక్టర్లు, రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి అందజేస్తామన్నారు. 40 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి బీఆర్‌ఎస్ మండల, గ్రామ స్థాయి నాయకులు ఇంటింటికి వెళ్లి రుణమాఫీ కాని రైతుల వివరాలను పార్టీ ఇచ్చిన ప్రొఫార్మాలో రైతుల వివరాలు సేకరించాలన్నారు. రైతులంతా పార్టీలకతీతంగా రేవంత్‌రెడ్డి మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఎల్కతుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ



ఎల్కతుర్తి: కోల్‌కతాలో పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళలు మండలకేంద్రంలోని గ్రామ పంచాయితీ నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం, ఉమెన్‌సెల్ అధ్యక్షురాలు లోకిని స్వరూప, ఉపాధ్యక్షురాలు అంబాల స్వరూప మాట్లాడుతూ వైద్యురాలి హత్య ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేకూర్చాలని, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, సీఏ కవిత, కోమలత, కల్పన, రత్నకుమారి, శైలజ, అల్లి సుమలత, కొమ్మిడి రజిత, అపర్ణ, రాధ తదితరులు పాల్గొన్నారు.

రైతుపాలిట కల్పతరువు

ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం

- 1956లో 373 మంది సభ్యులతో ప్రారంభం
- ప్రస్తుతం 7,641 మంది సభ్యులు, 132 మంది ఉద్యోగులు



ముల్కనూర్‌లోని సహకార గ్రామీణ పరపతి సంఘం భవనం

ఎల్కతుర్తి: అసలే మెట్టప్రాంతం..కరువు నేలలో సాగునీరు, తాగునీరు లేక రైతన్నలు అల్లాడిన పరిస్థితులు. వర్షాలు లేక పంటలు పండక బతుకుదెరువు కోసం కట్టుబట్టలతో వలస వెళ్లిన రోజులు..సాగునీరు లేక భూములన్నీ బీళ్లుగా మారాయి. ఎవుసం బావులు నీళ్ల లేక అడుగంటినయ్..అంతటి కరువు కోరల్లో సైతం ఈ ప్రాంతంలో సహకారోద్యమం విరాజిల్లింది..చేయి చేయి కలిపి ప్రారంభమైన ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం రైతన్నకు చేదోడు వాదోడుగా నిలిచింది. రైతులకు చేస్తున్న సేవలకు ప్రశంసలందుకుంది. దేశవిదేశాల నుంచి ప్రతినిధులు ఈ సంఘాన్ని సందర్శించి తమ ప్రాంతాల్లో వ్యవసాయ సంఘాలను నెలకొల్పేందుకు బాసటగా నిలుస్తోంది...

ప్రారంభం:

రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దివంగత కాశీ విశ్వనాథరెడ్డి రైతులతో కలిసి 1956లో ములకనూరు సహకార గ్రామీణ బ్యాంకును స్థాపించారు. 373 మందితో ప్రారంభమైన ఈ బ్యాంకులో ప్రస్తుతం 7,641మంది సభ్యులున్నారు. ఒకే ఒక్క ఉద్యోగితో రూ.100 వాటాధనంతో ప్రారంభం కాగా అంచెలంచెలుగా ఎదుగుతూ 132 మంది ఉద్యోగులు,రూ.40 కోట్ల స్థిరాస్తులతో లాభాలబాటన పయనిస్తోంది. ప్రతి ఏటా రూ.309 కోట్ల మేర వ్యాపారం చేస్తుంది. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని 14 గ్రామాల రైతులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. గతంలో ఈ బ్యాంకుకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

విత్తనశుద్ధి కేంద్రాలు :

రైతుల సౌకర్యం కోసం బ్యాంకు విత్తనశుద్ధి కర్మాగారాలను నెలకొల్పింది. ముల్కనూరు వడ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మనరాష్ట్రంలోనే గాకుండా ఇతర రాష్ట్రాలకు సైతం ములకనూరు వడ్లు సరఫరా అవుతున్నాయి. రైతులు పండించిన ధాన్యం తడిసి ముద్దవకుండా బ్యాంకు పరిధిలోని అన్ని గ్రామాల్లో దాదాపు గిడ్డంగులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు పారాబాయిల్డ్ రైస్‌మిల్లు, కాటన్ జిన్నింగ్ మిల్లు, ప్రెస్సింగ్ మిల్లు లు సైతం ఉన్నాయి. రైతుల కోసం పెట్రోల్‌పంపు, భారత్‌గ్యాస్, సూపర్ మార్కెట్ ఉన్నాయి.

జాతీయ ఎక్సలెన్స్ అవార్డు

ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు రైతులకు చేస్తున్న సేవలకు గాను 2015లో జాతీయ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. దీనిని ఢిల్లీలో అప్పటి కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి మోహన్‌భాయ్ కల్యాణ్‌జీ బాయి కుందారియా, ఎన్సీడీసీ ఎండీ వసుధా మిశ్రా చేతుల మీదుగా బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

విదేశీయుల సందర్శన

ముల్కనూరు సహకార గ్రామీణబ్యాంకును అధ్యయనం చేసేందుకు ప్రతి ఏటా దేశవిదేశాల నుంచి ప్రతినిధులు వస్తారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంగా మారింది.

సభ్యుల సమష్టి కృషివల్లే..



సభ్యుల సమష్టి కృషితోనే సహకార బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోంది. ఉద్యోగుల నిజాయితీ, సభ్యుల నమ్మకం ఈ బ్యాంకును ప్రగతిబాటన నడిపిస్తున్నాయి.

– అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు

పాలకవర్గం నమ్మకంతోనే..



సభ్యుల పరస్పర సహకారంతో పాటు పాలకవర్గం, ఉద్యోగులపై నమ్మకంతోనే సంస్థ అభివృద్ధి బాటలో పయనిస్తోంది. సభ్యుల సంక్షేమం కోసం చాలాపథకాలను పాలకవర్గం ప్రవేశపెట్టింది.

– మారుపాటి రాంరెడ్డి, జీఎం

గీత కార్మికులకు కాటమయ్య కిట్ల పంపిణీ

హన్మకొండ (పరకాల): పరకాల పట్టణంలోని గీత కార్మికులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాటమయ్య కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించిన అనంతరం గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్‌లు ప్రావీణ్య, పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరకాల ఆర్డీఓ కె.నారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.నరసింహ, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ వినతి

పరకాలలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి

పద్మశాలి సంఘం ఎన్నికలు ప్రశాంతం



ఆత్మకూరు : ఓటు హక్కు వినియోగించుకుంటున్న సంఘం సభ్యులు



శాయంపేట : ఓటు హక్కు వినియోగించుకున్న పద్మశాలి కులస్తులు

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రత్యక్ష బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక చేనేత సొసైటీలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలు ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. మండలంలో మొత్తం 764 సభ్యులకు 625మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 80.80శాతం ఓటింగ్ శాతం జరిగినట్లు ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి వసునూటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఓటింగ్ సరళని జిల్లా ఎన్నికల అధికారి ప్రొఫెసర్ రామస్వామి సందర్శించి పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌కు సీల్ వేసి హైదరాబాద్‌కు తరలించనున్నట్లు తెలిపారు. అధ్యక్ష పదవికి జరిగిన పోలింగ్ ప్రక్రియలో వల్లకటి రాజ్‌కుమార్‌కు భారీగా ఓట్లు నమోదైనట్లు ప్యానల్ వర్గం సభ్యులు తెలిపారు. ఎన్నికల్లో మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, సొసైటి చైర్మన్ మామిడి శంకర్‌లింగం, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల ప్రసాద్, నాయకులు మధుసూదన్, లక్ష్మీనారాయణ, సదాశివుడు, రమేశ్, జలంధర్, పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఆదివారం పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా కందకట్ల రాము వ్యవహరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు, నాయకులు ఇర్సడ్ల సదానందం, వడ్డేపల్లి ప్రసాద్, రంజిత్‌కుమార్, వేణుగోపాల్, కేదారి, వేణుగోపాల్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవకు నూతన రథం బహూకరణ



మల్లన్నకు సమర్పించిన రథం

ఐనవోలు: స్థానిక మల్లికార్జునస్వామి ఆలయంలో నూతన రథం సేవలు నేటితో ప్రారంభమయ్యాయి. గీసుకొండకు చెందిన తాటికొండ మల్లేశం-రమాదేవి దంపతులు స్వామివారికి రథాన్ని ఆదివారం బహూకరించారు. మల్లేశం వృత్తి రీత్యా కార్పెంటర్ చిన్నప్పటి నుంచి మల్లన్నపై అపారమైన భక్తి కలిగి ఉండేవాడు. కాగా మల్లేశం దంపతులకు ఇద్దరు కుమారులు ఉంగా ఒకరు అనారోగ్యంతో, మరొకరు ప్రమాదంలో మృతిచెందారు. ప్రమాదంలో ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన డబ్బులతో మల్లన్న రథం చేయిస్తా అని మొక్కుకుని సంతానం కలగాలని వేడుకున్నాడు. మల్లన్న దయతో వీరికి ముగ్గురు కవల పిల్లలు జన్మించారు. ఆనందంతో మల్లికార్జునస్వామికి రూ.10 లక్షల వ్యయంతో టేకు కర్రతో తానే స్వయంగా రథాన్ని తయారు చేసి ఆదివారం సమర్పించాడు. మల్లేశం రమాదేవి దంపతులను ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చక బృందం ఆలయ సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రాలు బహూకరించారు. దంపతులకు వేదాశీర్వచనం చేసి ఆశీర్వదించారు. అనంతరం శ్రీమల్లికార్జునస్వామి ఉత్సవ మూర్తులను రథంలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి సేవ చేశారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు శ్రీనివాస్, మధుకర్ శర్మ అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి 'పొంగులేటి'ని కలిసిన నాయకులు



మంత్రిని కలిసేందుకు వచ్చిన నాయకులు



మంత్రికి పూల మొక్క అందజేస్తున్న రమణారెడ్డి

హన్మకొండ (పరకాల): ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ హోదాలో పరకాల పట్టణానికి మొదటిసారి వచ్చిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసేందుకు పరకాల మున్సిపాలిటీ కార్యాలయానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో నిండిపోయింది. 10 ఏళ్ల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల కోసం నాయకుల్లో పోటీ కనపడుతుంది. ఈ సమయంలో నాయకులు మంత్రి దృష్టిలో పడేందుకు హెలిప్యాడ్ నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వరకు నానా తంటాలు పడ్డారు. అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి కార్యాలయం బయటకు రావాలంటే అరగంట సమయం పట్టింది. కొందరైతే ఏకంగా మంత్రి ఏదైనా నామినేటెడ్ పదవితో మాకు న్యాయం చేయాలని కోరడం కనిపించింది.

ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలి

దామెర: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి కోరారు. పరకాలలో ఆదివారం మంత్రి పర్యటన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కోరారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండలంలో పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాలు నిర్మించాల్సి ఉందని అన్నారు. మంత్రి చొరవతీసుకొని కార్యాలయాలు త్వరగా పూర్తిచేయాలని కోరినట్లు వెల్లడించారు. ఆయన వెంట నాయకులు రాజస్వామి, మొద్దు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సల్లంగ చూడు పోచమ్మతల్లి



ఎల్కతుర్తి: ముల్కనూర్‌లో బోనాలు ఎత్తుకొని ఆలయం వద్దకు వెళ్తున్న మహిళలు



శాయంపేట: బోనాలతో బయలుదేరిన మహిళలు

ఎల్కతుర్తి: పిల్లాపాపలను సల్లంగ చూడు పోచమ్మ తల్లి అంటూ మహిళలు పోచమ్మ తల్లికి ఆదివారం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, ములకనూర్‌లో విశ్వబ్రాహ్మ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నిర్వహించి డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నియమనిష్టతో వండిన బోనాలు, నైవేద్యం సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

శాయంపేట : మండల కేంద్రంలోని రజక కులస్తులు శ్రావణమాసం రెండో ఆదివారం పురస్కరించుకొని పోచమ్మ బోనాలు వైభవంగా సమర్పించారు. డీజే సౌండ్స్ మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లను బలిచ్చి సల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం ఆచార సంప్రదాయాలతో మడేలయ్యకు బోనం సమర్పించి గొర్రెపోతును బలిచ్చారు. కార్యక్రమంలో కుల పెద్దలు నడిగొట్టు మొగిలి, సాంబయ్య, పున్నం సదానందం, కొత్తపల్లి రవి, నవీన్, పైండ్ల రమేశ్, పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న ఆశయాలు కొనసాగించాలి

సర్దార్ సర్వాయి పాపన్న జమీందారులు, జాగిర్దారుల అరాచకాలకు వ్యతిరేకంగా కత్తిపట్టి పోరాటం సాగించారని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు, గౌడసంఘం నాయకులు ఆదివారం భీమదేవరపల్లి మండలంతో పాటు ఎల్కతుర్తి, కమలాపూర్, దామెర, ఐనవోలు మండల కేంద్రాల్లో, మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, గౌడ సంఘం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఎల్కతుర్తి : సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, గీత కార్మిక నేతలు



కమలాపూర్ : కేక్ కట్ చేస్తున్న నాయకులు



దామెర : దుర్గంపేట్‌లో..



ఐనవోలులో..

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఐనవోలు : మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు: నాలుగు రోజుల్లో పెళ్లి జరగాల్సిన ఇంట్లో రోడ్డు ప్రమాదంలో పెళ్లి కుమారుడు మజ్జిగ అశోక్ తండ్రి, పెదనాన్న కొడుకు మృతి చెందగా మండలంలోని ఒంటిమామిడిపల్లిలో విషాదం నెలకొంది. శుభలేఖలు పంచడానికి పోయిన అశోక్ తండ్రి వెంకటనారాయణ, పెదనాన్న కొడుకు రంజిత్‌లు శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహాలు తీసుకురాగా వారి బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడు రంజిత్‌కు రెండేళ్ల క్రితమే వివాహమైంది. దీంతో రెండు కుటుంబాలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. కాగా మృతదేహాలను మార్చురి వద్ద ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందర్శించి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మృతుల అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పలువురు మండల నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ రంగు శ్రీధర్ తల్లి చెన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మండలంలోని జర్నలిస్టులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో జర్నలిస్టులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా గుంత

మండల కేంద్రంలోని పనగట్ల సమీపంలో కమలాపూర్-హనుమకొండ ప్రధాన మార్గంలో నడిరోడ్డుపై ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా మారింది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు ఇప్పటికే ఆ గుంతలో పడి గాయాలపాలయ్యారు. గుంత పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

– కమలాపూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
జయశ్రీ, ఆర్‌అండ్‌బీ ఏఈ
ఫోన్‌నంబర్ : 98661 66729

రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కమలాపూర్: రైలు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మంచినీళ్ల రాకేశ్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో రామగుండం వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఉప్పల్ రైల్వేస్టేషన్‌లో రైల్లోంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రాకేశ్‌కు కాలు విరగగా సమాచారం అందుకున్న కమలాపూర్ 108 సిబ్బంది ఈఎంటీ బండ ఉపేందర్, పైలట్ కుమారస్వామి క్షతగాత్రుడిని హుజూరాబాద్‌లోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షుడిగా సూర్యనారాయణ



సూర్యనారాయణను సన్మానిస్తున్న సభ్యులు

శాయంపేట : స్థానిక జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నూతన అల్యూమిని అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రస్తుత ప్రిన్సిపాల్ రేవతి సమక్షంలో మొదటి నూతన అల్యూమిని అసోసియేషన్ కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. అధ్యక్షుడిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా అమరేందర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా అమరేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ సురేష్, సృజన్, శ్రీరామ్, డాకర్ వినయ్, సలహా కమిటీ సభ్యులుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ సిద్దోజు ఓంబ్రహ్మం, కొమురయ్య, హరి, రేవతి, సత్యనారాయణ సమక్షంలో మొదటి అల్యూమిని అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో 2003–04 పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో వన్నాల శ్రీనివాస్, బాలకృష్ణ, నరేష్, రామకృష్ణ, రంజిత్, వెంకటేష్, విజయ్, కుమారస్వామి పాల్గొన్నారు.